క్లుప్తంగా

మిట్స్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో 201 నుంచి 300 స్థానం కళాశాలగా గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ పి. రామనాథన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 సంవత్సరానికి గాను దేశంలో అత్యుత్తమ విద్యా సంస్థల జాబితాను కేంద్ర విద్యా శాఖ విడుదల చేసినట్లు తెలిపారు. విద్యా సంస్థలో విద్యా బోధన, సౌకర్యాల ఆధారంగా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను ప్రకటించినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో మిట్స్ కళాశాలకు ఈ ర్యాంకు లభించడం గర్వకారణమని కళాశాల నిర్వాహకులు నాదేళ్ల విజయ భాస్కర్ చౌదరి తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పీలేరు రూరల్ : స్థానిక రాజీవ్‌నగర్‌లో కాలనీలో జేకేడీ కరాటే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన బెల్ట్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరాటే మాస్టర్ దామోదర్ తెలిపారు. 5 మంది ఎల్లో బెల్ట్, 11 మంది ఆరెంజ్ బెల్ట్, ముగ్గురు బ్రౌన్ బెల్ట్ సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేసినట్లు తెలిపారు. పర్యవేక్షకులుగా దస్తగిరి మాస్టర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మదనపల్లె రూరల్ : కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. అమ్మచెరువుమిట్ట ఏపీ గోడౌన్ సమీపంలో ఉంటున్న లియాఖత్ అలీ(63) వ్యక్తిగత పనులపై నీరుగట్టువారిపల్లె రింగ్‌రోడ్డు వద్దకు వచ్చాడు. రోడ్డు పక్కన నిల్చుని ఉండగా, అటువైపు వేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొంది. ప్రమాదంలో లియాఖత్ అలీ తీవ్రంగా గాయపడగా స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆలయాలు మూసివేత



మూసివేసిన వెంకటరమణస్వామి ఆలయం

మదనపల్లె సిటీ: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మదనపల్లె పట్టణంలోని ఆలయాలు మూసివేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం, శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం ఉదయం పూజలు చేసిన తరువాత 11 గంటలకు మూసిశారు. దీంతో పాటు పట్టణంలో యోగభోగేశ్వర స్వామి ఆలయం, మంజునాథస్వామిఆలయం , అయ్యప్పస్వామి ఆలయాలు మూసి వేశారు. సోమవారం ఆలయాలు సంప్రోక్షణ చేసిన తరువాత ఆలయాలు తెరుస్తారు.

మల్లయ్యకొండపై గిరిప్రదక్షణ



గిరిప్రదక్షిణ వాహనం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తంబళ్లపల్లె: పౌర్ణమి సందర్భంగా భక్తులు ఆదివారం మల్లయ్యకొండ, ఇనుముకొండ, సాధు కొండలపై భక్తులకు గిరిప్రదక్షిణ చేశారు. ప్రభాకర్‌రెడ్డి ,గురివిరెడ్డి, శివరాంరెడ్డి, అడవలిపల్లి శివశంకర్‌రెడ్డి, శివారెడ్డిలు భక్తులతో ప్రత్యేక వాహనంలో భజనలు చేస్తూ గిరిప్రదక్షణ చేశారు. అనంతరం మల్లయ్యకొండపై స్వామి దర్శించుకుని పూజలు అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న గొల్లపూడి తిరుపతిరావు

మదనపల్లె సిటీ: మదనపల్లెలో పట్టణ ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతి రావు కోరారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలలో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యపై ప్రభుత్వానికి వినతిపత్రాలు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం సంతకాల సేకరణ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం, టీఎస్ఏ కృష్ణమూర్తి, అడ్వకేట్ అనురాధ, జగన్‌మోహన్,, ఆడిటర్ రామచంద్రరావు, సురేష్, ఆదిరెడ్డి, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు బాసటగా అన్నదాత పోరు

- ఎరువుల కొరతను పట్టించుకోని ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి





వాల్మీకిపురంలో అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లెలో నిసార్ అహ్మద్, పార్టీ నాయకులు

కలికిరి(వాల్మీకిపురం): రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన తలపెట్టిన ‘అన్నదాత పోరు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రైతుల కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. టమాటా, వరి, ఉల్లి, మిరప, దోస, బొప్పాయి, మామిడి ఇలా పండించిన ఏ పంటకూ మద్దతు ధరలు లేక రైతులు తీవ్ర నష్టాలపాలయ్యారు. తిరిగి పంటల సాగు మొదలు పెడదామంటే అవసరమైన ఎరువులు అందుబాటులో లేక బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు అందచేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత ప్రభుత్వంలో రైతులకు అందుబాటులో ఉన్న ఉచిత బీమా సదుపాయానికి ప్రభుత్వం మంగళం పాడింది. వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులకు కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వడం లేదు. ప్రతి విషయంలోనూ ప్రభుత్వం రైతాంగాన్ని దగా చేస్తోంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు పక్షాన నిలిచి పోరాటానికి సిద్ధమైంది. ఈ నెల తొమ్మిదిన మంగళవారం జిల్లా కేంద్రంలో రైతుల సమస్యలపై కలెక్టరుకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుంది. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, రైతు విభాగం నేతలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి: కలికిరి మండలం గుండ్లూరు గ్రామం నాయకునివారిపల్లిలో జంగేటి చిన్నవెంకటరమణ ఇటీవల మరణించారు. ఆదివారం ఆయన దశదిన కర్మ కార్యక్రమానికి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై చిన్న వెంకటరమణ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బిడ్డల కేశవరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు నీళ్ళ భాస్కర్, కలికిరి మండల కన్వీనర్‌లు చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ రాయల్, చికెన్ మస్తాన్, గాంధీపేట రఘు, పీవీ రామక్రిష్ణారెడ్డి, మదన్మోహన్‌రెడ్డి, ఆనంద, చలపతి, చీకటపల్లి సర్పంచ్ సురేంద్రనాథరెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటపతి, కరుణాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలలో ప్రభుత్వం విఫలం

మదనపల్లె : అన్నదాతలకు సకాలంలో ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్ఆర్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ విమర్శించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈనెల 9న పార్టీ చేపట్టిన రైతు పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల కాలంలో రైతాంగానికి మద్దతుగా నిలవడం లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా చితికిపోయిన రైతులకు కనీసం ఎరువులను కూడా సరఫరా చేయలేకపోతోందని అన్నారు. మామిడి, టమాటా, అల్లనేరెడుకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టడులు అందక నష్టాలు మిగులుతున్నాయని అన్నారు. ఎన్నికలప్పుడు అధికారం కోసం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. టమాట రైతాంగాన్ని ఆదుకుంటామని, పల్ప్ పరిశ్రమ, ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ ఎప్పుడు నేరవేరుస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 14 నెలలు గడచిపోయాయి, మరో రెండేళ్ళకు అయిన ఆలోచన చేసి చేస్తారా అని ఎద్దేవా చేశారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు హామీ ఏమైందని నిలదీశారు. రైతాంగం యూరియా కోసం అవస్థలు పడుతుంటే.. అధికారులు ఒక రైతుకు ఒక వస్తా అంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రైతాంగ సమస్యలకు పరిష్కారం కోసం పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. 9వ తేదీన జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమంతో పాటు కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌర్ణమి పూజలు

మదనపల్లె రూరల్ : మండలంలోని వలసపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన పౌర్ణమి ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. స్థానిక నాయకులు రెడ్డెప్పరెడ్డి ఆహ్వానం మేరకు ఆంజనేయస్వామి ఆలయానికి, నిసార్ అహ్మద్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు అందుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అభయప్రదాతగా, అంజనీసుతుడుగా, వాయుపుత్రుడుగా కీర్తించబడే ఆంజనేయస్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే, జీవితంలోని సమస్యలను ఎదుర్కొనే ధైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందనే నమ్మకం స్వామివారిని దర్శించాక కలిగిందన్నారు. స్వామివారి కృపా,కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలని, వైఎస్సార్ సీపీకి మళ్లీ పూర్వవైభవంతో పాటుగా ప్రజానాయకులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దండాల రవిచంద్రారెడ్డి, జన్నే సుబ్బయ్యనాయుడు, సురేంద్రరెడ్డి, చిన్నరెడ్డెప్పరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చెన్నా, శంకర్‌నాయక్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



వలసపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి పూజల్లో నిసార్‌అహ్మద్, నాయకులు

మల్లయ్యకొండపై ఎమ్మెల్యే పూజలు



పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమారంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు,పూజారులు ఈశ్వరమ్మ, మల్లికార్జునలు స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు నిర్వహించి స్వామి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. నియోజకవర్గంలో వర్షాలు పుష్కలంగా కురిసి పాడిపంటలు, ప్రజలు ఆయుఆయురోగ్యాలతో వర్ధిల్లే విధంగా స్వామి కృప కలగాలని మొక్కుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జయనారాయణరెడ్డి, కరీమ్, కెఆర్ మల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

30 పడకల ఆసుపత్రి కోసం మంత్రికి వినతి

పెద్దతిప్పసముద్రం: స్థానిక పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని పీటీఎంకు చెందిన బీజేపీ జిల్లా కన్వీనర్ పూల నాగరాజు మదనపల్లికి విచ్చేసిన మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పీటీఎంలో వైద్య సిబ్బంది 24 గంటలు ఆసుపత్రిలోనే ప్రజలకు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని మంత్రికి ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. ఈ మేరకు సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాగరాజు ఆదివారం తెలిపారు.

ఓట్ చోరీపై రాష్ట్రపతికి పోస్టు కార్డులు



పోస్టు బాక్సులో కార్డులు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మదనపల్లె: కేంద్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఓటు చోరీకి పాల్పడిందని రాహుల్ గాంధీ ఆరోపణలకు మేం అండగా నిలుస్తున్నామని మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షేక్ రెడ్డి సాహెబ్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయి సంపత్ ఆధ్వర్యంలో సేకరించిన రాష్ట్రపతికి రాసిన పోస్టు కార్డులను వారు ఆదివారం స్థానిక తపాలా కార్యాలయ బాక్సులో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఓటు యాత్రకు మద్దతిస్తున్నామని పోస్ట్ కార్డులో రాష్ట్రపతికి తెలిపినటేకల పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడటం దేశ ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఈసీ ప్రెస్‌మీట్ పెట్టి బీజేపీకి తొత్తుగా మాట్లాడిందే తప్ప చిత్తశుద్ధిని నిరూపించుకోలేకపోయిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తేజ, మదనపల్లి టౌన్ మాజీ కార్యదర్శి మహమ్మద్ అలీ, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలి.. పాడి పంటలు పండాలి

– గంగమ్మకు మహిళలు బోనాలు



తెట్టు పాలేటి గంగమ్మ గుడి వద్ద పూజారివారిపల్లె మహిళల బోనాలు

కురబలకోట: వర్షాలు బాగా కురవాలని పాడిపంటలు పండాలని అంతా క్షేమంగా ఉండాలని ఆశిస్తూ కురబలకోట మండలంలోని పూజారివారిపల్లె గ్రామ మహిళలు ఆదివారం తెట్టు పాలేటి గంగమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలు సమర్పించారు. మండలంలో అత్యధికులు రైతులే. ఆశల జీవితం వీరిది. రాబోయే వర్షా కాలంలో వానలు బాగా పడాలని పాడిపంటలతో పల్లెలు సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజారివారిపల్లెలోని మహిళలు బోనాలు మోశారు. సాంప్రదాయ బద్ధంగా భక్తి భావంతో నడిచారు. అమ్మా కరుణించూ అంటూ మొక్కుకున్నారు. అమ్మ వారి ఆరాధనలో లీనమయ్యారు. ఇళ్లల్లో సుఖ శాంతులు నెలకొనాలని భక్తి శ్రద్దలతో ప్రత్యేక ప్రార్థనలు గావించారు. ఆలయ ధర్మకర్త, విశ్వం ఇంజినీరింగ్ కళాశాల డీన్ పబ్లిక్ రిలేషన్స్ పూజారి ఆంజి గుడి వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 200 కుటుంబాలు అమ్మవారికి బోనాలు సమర్పించినట్లు తెలిపారు.

పొరుగు జిల్లాలకు బ్యాంకు సేవల విస్తరణ

- రూ.91.45 కోట్లకు చేరిన డిపాజిట్లు
- ఖాతాదారులకు యూపీఏ సేవలు
- మహాజన సభలో చైర్మన్ నాదెళ్ల విద్య, సీఈఓ ప్రసాద్



మాట్లాడుతున్న చైర్మన్ విద్యాసాగర్

మదనపల్లె: మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సేవలను తిరుపతి, చిత్తూరు, వైయస్సార్ కడప, శ్రీ పుట్టపర్తి సత్యసాయి జిల్లాల్లో విస్తరింప చేసేందుకు చర్యలు చేపట్టామని బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ వెల్లడించారు. ఆదివారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో వార్షిక మహాజన సభ ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు యూపీఏ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. దీని ద్వారా లావాదేవీలు జరపవచ్చన్నారు. మొబైల్ బ్యాంకులు కూడా తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారులకు ఆకర్షణీయమైన పథకాలు, రుణాలు అందిస్తున్నామన్నారు. రుణాల రికవరీ బాగుందని అన్నారు. బ్యాంకు సీఈఓ పివి. ప్రసాద్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు డిపాజిట్లు రూ.91.45 కోట్లు కాగా ఖాతాదారులకు రూ.64.88 కోట్ల రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. స్థూల ఆదాయం రూ.1.58 కోట్లు ఉండగా అందులో ఆదాయ పన్ను రూ.39.90 లక్షలు చెల్లించగా రూ.1.18 కోట్ల నికర ఆదాయం వచ్చిందన్నారు. ఏ తరగతి సభ్యుల వాటా ధనం రూ.2.31 కోట్లు ఉండగా వ్యాపార విలువ రూ.112.84 కోట్లని చెప్పారు. సభకు వైస్ చైర్మన్ భాస్కర్ కుమార్, డైరెక్టర్లు రవీంద్ర నాథ్, ముక్తియార్ ఖాన్, సోమమేఖర్ , నాదేళ్ళ వెంకటేశ్వర ప్రసాద్, ఆకుల కష్ణమూర్తి, జోశిపాళెం దేవేంద్ర, సర్దార్, భాస్కర్, వి.నిరంజన్, ప్రొఫెషనల్ డైరెక్టర్ కోటేశ్వరరావు, లీగల్ అడ్వైజర్ విజయ కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రెడ్డెమ్మ తల్లికి పూజలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. మరికొందరు తలనీలాలు సమర్పించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ మెట్లకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి దర్శించుకోవడం గమనార్హం.

అటకెక్కిన రాయితీ రుణాలు

- కార్పొరేషన్ రుణాల మంజూరు ఎప్పుడు?
- జీసీలకు ఇంటర్వ్యూలతో సరి పెట్టారు
- ఎస్సీ, మైనారిటీలకు యూనిట్ల మంజూరు ప్రకటనలకే పరిమితం



ఇంటర్వ్యూకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: నిరుద్యోగులను అన్ని విధాలా ఆదుకుంటాం. వారికి ప్రతి నెలా నిరుద్యోగ భృతి అందజేస్తాం. వివిధ కార్పొరేషన్ల ద్వారా అన్ని రకాల యూనిట్లు మంజూరు చేస్తాం. నిరుద్యోగుల ఉపాధి కల్పనకు రాయితీ రుణాలు మంజూరు చేస్తామని పాలకులు ఊకదంపుడు హామీలు గుప్పించారు. దీంతో అర్హులైన వందలాది మంది నిరుద్యోగులు ఎంతో సంబర పడ్డారు. నిరుద్యోగ భృతి మంజూరు పక్కన పెడితే కనీసం రాయితీ రుణాలైనా వస్తాయనే గంపెడాశతో వారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అష్ట కష్టాలు పడి రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నా కూడా ప్రభుత్వం ఇంత వరకు వాటి ఊసే ఎత్తకపోవడం శోచనీయం. ఉదాహరణకు.. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా బీసీ కార్పొరేషన్ ద్వారా 40, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 33, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 25 యూనిట్ల మంజూరు కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్ విడుదల చేయగా అదే నెల 19న బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఇంత వరకు నయా పైసా రుణం మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూస్తే ప్రభుత్వ రాయితీ మంజూరు కోసం కార్పొరేషన్‌కు సిఫారసు చేసామంటున్నారు. ఇంటర్వ్యూలు జరిగిన ఏడు నెలల నుంచి ఎంపికైన లబ్ధిదారులు రుణాల మంజూరు కోసం కళ్ళల్లో ఒత్తులు వేసుకుని నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా మిగిలిన ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ల యూనిట్ల మంజూరు ప్రకటనలకే పరిమితం కావడం, ఇంత వరకు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించకపోవడం గమనార్హం.

అక్రమకేసులు ఎంతోకాలం నిలబడవు





కలకడ: ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన రావుల నరసింహారెడ్డి, కలికిరి: ఎంపీతో రత్నశేఖర్‌రెడ్డి తదితరులు

కలకడ : అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెట్టినా అలాంటి కేసులు ఎంతోకాలం నిలబడవు. లేని లిక్కర్ కేసు నుంచి కడిగిన ముత్యంలా క్లీన్ చిట్‌తో ఎంపీ మిథున్‌రెడ్డి బయటకు వస్తావని వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రావుల నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎంపి పీవిమిథున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా మండల నాయకులు కలిశారు. కార్యకర్తలను, నాయకులను భయపెట్టాలని కూటమి ప్రభుత్వం కుట్రలు చేయడం ఇది మొదటిసారి కాదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధింపును ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన నాయకులు

కలికిరి: లేని లిక్కర్ స్కామ్ కేసు నుంచి మధ్యంతర బెయిల్‌పై విడుదలైన ఎంపీ మిథున్‌రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో కలికిరి మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి కలిశారు. అక్రమ కేసు నుంచి త్వరగా బయటపడాలని ఆకాంక్షించినట్లు ఆయన తెలిపారు. తరుణ్‌కుమార్‌రెడ్డి ఆయన వెంట పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం



వినాయక నిమజ్జన ఊరేగింపులో కోలాట ప్రదర్శన

కురబలకోట: మండలంలో అంగళ్లు గ్రామంలోని మొలకవారిపల్లె భారీ వినాయక ప్రతిమ నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అట్టహాసంగా జరిపారు. కోలాటం, డ్రమ్స్‌తో ఆకట్టుకున్నారు. ఊరంతా ఊరేగించి అనంతరం నిమజ్జన గావించారు. అప్పినపల్లి సుశీల ఆమె తనయులు శశి, మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో ఈ సారి కూడా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ప్రతి ఏటా ఈ ఊరిలో యూత్ ఆధ్వర్యంలో వైభవంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంది. మండలంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఏటా ఇక్కడ వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత

కలికిరి: చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ఆలయాలు మూతపడ్డాయి. ఆలయాల నిర్వాహకులు గ్రహణం ప్రారంభానికి ముందే ఆలయాల ప్రధాన ద్వారాలను మూసివేశారు. కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ ఆలయం, శ్రీసోమేశ్వరాలయం, కన్యపరమేశ్వరి ఆలయం తదితర ఆలయాలను మూసివేశారు. తిరిగి సోమవారం గ్రహణం అనంతరం ఉదయం ఆలయ సంప్రోక్షణ, ఆలయ శుద్ధి అనంతరం ఆలయాలు తెలరచుకోనున్నాయి.

వాల్మీకిపురంలో...

కలికిరి(వాల్మీకిపురం): పట్టణంలో శ్రీపట్టాభిరామాలయంతో పాటు ప్రధాన ఆలయాలు చంద్రగ్రహణం సందర్భంగా శాస్త్రోక్తంగా మూసివేశారు. సోమవారం ఉదయం గ్రహణం పూర్తైన తరువాత ఆలయ శుద్ధి, సంప్రోణ కార్యక్రమాల అనంతరం తిరిగి ఆలయాలు తెరవడం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

ఆలయాలు మూసివేత

తంబళ్లపల్లె: మండలంలోని మల్లయ్యకొండపై వెలసి శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం, కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ప్రధాన ఆలయాలతో పాటు పలు ఆలయాలను చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేసినట్లు అర్చకులు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయాలు శుద్ధి,సంప్రోక్షణ అనంతరం భక్తులను స్వామి దర్శనం కల్పిస్తామన్నారు.



మూసివేసిన కలికిరి ఎల్లమ్మ ఆలయం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్, ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు

పీలేరు : మండలంలోని తలపుల పంచాయతీలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం ముద్దండాల మల్లేశ్వరస్వామి ఆలయం పరిసరాల ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ యుగంధర్ అన్నారు. ఆదివారం ఆలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకతాయిలు, ప్రేమికులు ఈ ప్రాంతంలో వికృత చేష్టలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో మాంసాహారం వండడం, మద్యం సేవించడం లాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న తెలిపారు. సీసీ కెమెరా, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఇకపై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మురళి, ఎస్ఐ లోకేష్, గ్రామస్తులు దామోదర్ రెడ్డి, హరికృష్ణ, భగత్, రాజశేఖర్, ఏడుకొండలు, బి. ద్వారక, ఎ. ద్వారక, సునీల్‌కుమార్‌రెడ్డి, నవీన్, మల్లికార్జున, నాగరాజు, రాజారెడ్డి, విజయ్, పోలీస్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.